RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ సంపుటి: 4 సంచిక:70 | శనివారం ఫిబ్రవరి 21, 2026 | పేజీలు 8 వెల: రూ.3-00



## సిద్దిపేట యువత కోసం హరీష్ అన్న ఉద్యోగ యాప్

ఉచిత ఆన్‌లైన్ తరగతులతో ఉద్యోగ అవకాశాల దిశగా అడుగు

2లో



## జీఎస్టీ మండలి తరహాలో భారత్ కృత్రిమ మేధ మండలి

- ఏఐను సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలనకు ఉపయోగించాలి
- కొత్త ఉద్యోగావకాశాలు సృష్టించాలి
- ఢిల్లీ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

2లో

## గాడెస్ ఆఫ్ ఫోక్.. సమ్మక్క సారలమ్మ జాతర

- ప్రజా భవన్‌లో ఘనంగా ఆవిష్కరించిన మంత్రి సీతక్క
- అరుదైన చిత్రాలతో సుసంపన్నమైన కాఫీ టేబుల్ పుస్తకం
- కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌కు అభినందనలు

2లో



## దక్షిణాసియాలో వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్ అడుగులు

- తెలంగాణ మెడికల్ టూరిజం సొసైటీ ఏర్పాటు ప్రతిపాదన
- పీపీపీ విధానంలో సమగ్ర వైద్య పర్యాటక కేంద్రానికి ప్రణాళిక
- యాభైకి పైగా గుర్తింపు పొందిన ఆసుపత్రులతో ముందంజ

2లో

తెలంగాణ రాజకీయ యవనికపై ఊహించని మలుపులు చోటుచేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత, తన తండ్రి కేసీఆర్ వారసత్వాన్ని కాపాడుకునే సాకుతో.. రాష్ట్ర రాజకీయాల్లో 'ట్రబుల్ షూటర్'గా పేరున్న హరీశ్ రావు కంచుకోటపైనే యుద్ధం ప్రకటించారు. ఇన్నాళ్లూ చేసిన వ్యాఖ్యలు.. పరోక్ష విమర్శలు మాత్రమే కాదు, హరీశ్ రావును రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా సంధించిన అస్త్రాలని స్పష్టమవుతోంది. మే మొదటి వారంలో తన కొత్త రాజకీయ పార్టీ జెండాను ఎగురవేయనున్న కవిత, సిద్దిపేటనే ఫస్ట్ చాయిస్ అని ప్రకటించడంతో రాష్ట్ర రాజకీయాల్లో చర్చ జరుగుతోంది.. సిద్దిపేట అంటేనే హరీశ్ రావు సామ్రాజ్యం. హరీశ్‌ను ఆయన సొంత గడ్డపైనే ఢీకొనడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. కేసీఆర్ నామస్మరణతో పాత కేడర్‌ను తన వైపు తిప్పుకోవచ్చని కవిత ధీమాగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో హరీశ్ రావుకున్న బలమైన కేడర్, ప్రజాభిమానం ముందు కవిత నిలవగలరా? అన్నది ఆసక్తికరంగా మారింది. నిజామాబాద్ జిల్లాలో తనకు బలమైన పునాదులు ఉన్నప్పటికీ, వాటిని వదిలి సిద్దిపేటనే పంతం పట్టిన కవిత వ్యూహం వెనుక అసలు రహస్యం ఏంటి? ఇది కేసీఆర్ వారసత్వం కోసం జరుగుతున్న అంతర్గత పోరాటమా? లేక తెలంగాణ రాజకీయాల్లో మూడో శక్తిగా ఎదగడానికి కవిత వేస్తున్న మాస్టర్ ప్లానా?

వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో



2లో

- ఇటీవల 'దెయ్యాలు.. గుంటనక్కలు' అంటూ వ్యాఖ్యలు
- తనను పార్టీలో ఒంటరి చేశారంటూ ఆరోపణలు
- నేడు సిద్దిపేట నుంచి పోటీ చేసి గెలుస్తానంటూ శపథం
- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన కవిత వ్యవహారం
- గులాబీ కోటను బద్దలు కొట్టడం సాధ్యమేనా?
- జననేతగా హరీశ్ రావుకు మంచి పేరు
- ప్రతి ఎన్నికల్లోనూ మెజార్టీలో తన రికార్డు తనే బ్రేక్
- మహామహులు సైతం ఓడించలేని నాయకుడిగా పేరు
- కవిత కాన్ఫడెన్స్ ఏంటి? అంటూ విశ్లేషకుల సందేహం
- పరాభవం తప్పదని.. నిర్ణయం మార్చుకోవాలని సూచన

# టార్గెట్ హరీష్!

## ట్రబుల్ షూటర్ లక్ష్యంగా కవిత అడుగులు

## ఐదు నిమిషాలు చాలు..

- మీ పూర్వీకులే ఏమీ చేయలేకపోయారు.. మీరు ఏమి చేస్తారు?
- 15 నిమిషాలు కాదు కదా.. 15 సంవత్సరాలు ఇచ్చినా ఏం చేయలేరు
- ఒవైసీ వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్



వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి


మీరు పదిహేను నిమిషాలు అడిగారు కానీ నాకు ఐదు నిమిషాల సమయం ఇవ్వగలరా.. అని మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మండిపడ్డారు. రాజాసింగ్ మాట్లాడుతూ.. పదిహేను నిమిషాలు కాదు పదిహేను గంటలు, పదిహేను రోజులు, పదిహేను

మిగతా 2వ పేజీలో..

## మైత్రివనం నీలగిరి బ్లాక్‌లో భారీ అగ్నిప్రమాదం

- నాలుగో అంతస్తులో విద్యార్థులు చిక్కుకోవడంతో కలకలం
- బాల్కనీ నుంచి దిగి ప్రాణాలు కాపాడుకున్న స్టూడెంట్స్
- రక్షణ చర్యల్లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది
- అమీర్‌పేట ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో సైతం..
- క్షణాల్లో స్పందించిన హైడ్రా బృందాలు

2లో






## భూపాలపల్లి కోర్టులో ఏసీబీ దాడులు

- రూ.5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ముగ్గురు సిబ్బంది
- సర్టిఫైడ్ కాపీ కోసం లంచం డిమాండ్
- న్యాయవాది ఫిర్యాదుతో అవినీతి నిరోధక శాఖ వల
- స్టెనోగ్రాఫర్ సహా ముగ్గురిపై కేసు నమోదు

2లో

## మైత్రివనం నీలగిరి బ్లాక్‌లో
# భారీ అగ్నిప్రమాదం

- నాలుగో అంతస్తులో విద్యార్థులు చిక్కుకోవడంతో కలకలం
- బాల్కనీ నుంచి దిగిప్రాణాలు కాపాడుకున్న విద్యార్థులు
- రక్షణ చర్యల్లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది
- అమీర్‌పేట ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో సైతం..
- క్షణాల్లో స్పందించిన హైడ్రా బృందాలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

నగరంలోని మైత్రివనం సముదాయంలోని నీలగిరి బ్లాక్ భవనంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో తీవ్ర కలకలం నెలకొంది. భవనం నాలుగో అంతస్తులో ఉన్న ఒక విద్యాసంస్థలో మంటలు చెలరేగడంతో అక్కడ ఉన్న విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో కొంతమంది విద్యార్థులు ప్రాణాలు రక్షించుకునేందుకు బాల్కనీ మార్గంగా కింది అంతస్తులకు దిగారు. ఆ సమయంలో భవనం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పై అంతస్తుల్లో చిక్కుకున్న మరికొంత మంది విద్యార్థులు సహాయం కోసం కేకలు వేయడంతో వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపులోకి తీసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పై అంతస్తులో చిక్కుకున్న వారిని బాల్కనీ మార్గంగా సురక్షితంగా కిందికి దించే చర్యలు చేపట్టారు. రక్షణ సిబ్బంది ప్రత్యేక పరికరాలతో విద్యార్థులను బయటకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో భవన భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది.

### అమీర్‌పేట ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో అగ్నిప్రమాదం

అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ నీలగిరి బ్లాక్ భవనంలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న విద్యుత్ కేబుళ్ల ప్యానల్ బోర్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడికక్కడే పొగలు వ్యాపించాయి. ఉదయం పదకొండు గంటల ఒక నిమిషానికి హైడ్రా నియంత్రణ కేంద్రానికి సమాచారం అందగా, క్షణాల్లో ఫీల్డ్‌లో ఉన్న హైడ్రా విపత్తు స్పందన బృందాలు అక్కడికి చేరుకున్నాయి. సరిగ్గా మూడు నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్న బృందాలు ఫైర్ ఎక్స్టింగ్విషర్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చాయి. మెట్ల మార్గం వద్ద కేబుళ్లు తగలబడి పొగలు వ్యాపించడంతో రెండో అంతస్తులో చిక్కుకున్న వారిని రోప్ ల్యాడర్ల సాయంతో సురక్షితంగా కిందకు దించారు. మొత్తం యాభై మందికి పైగా ఉన్నవారిని సురక్షితంగా బయటకు తరలించారు. ఫైర్ మరియు పోలీసు శాఖలు కూడా సహాయక చర్యల్లో భాగస్వామ్యమయ్యాయి. అమీర్‌పేట ప్రాంతంలో అనేక శిక్షణ కేంద్రాలు, కార్యాలయాలు ఉండటంతో పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ, వేగవంతమైన చర్యల వల్ల పెను ప్రమాదం తప్పింది. మంటలు ఆర్పడంలో స్వల్ప ఆలస్యం జరిగినా పరిస్థితి విషమించేదని అధికారులు తెలిపారు. సంఘటన స్థలాన్ని హైడ్రా కమిషనర్ ఏ వీ రంగనాథ్ పరిశీలించారు.

## భూపాలపల్లి కోర్టులో
# ఏసీబీ దాడులు

- రూ.5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ముగ్గురు సిబ్బంది
- సర్టిఫైడ్ కాపీ కోసం లంచం డిమాండ్
- న్యాయవాది ఫిర్యాదుతో అవినీతి నిరోధక శాఖ వల
- స్టెనోగ్రాఫర్ సహా ముగ్గురిపై కేసు నమోదు

**వేద న్యూస్, భూపాలపల్లి**

భూపాలపల్లి జిల్లా కోర్టులో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు కోర్టు సిబ్బందిని పట్టుకున్నారు. సర్టిఫైడ్ కాపీ ఇవ్వడానికి ఐదు వేల రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలపై ఈ చర్యలు చేపట్టారు. స్టెనోగ్రాఫర్ పాలకుర్తి సాయి చరణ్, సిబ్బంది పున్నం రజిత, కొమ్ము సునీతలను లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. సీహెచ్ గోపాలరావు అనే న్యాయవాది సర్టిఫైడ్ కాపీ కోసం వెళ్లగా డబ్బులు డిమాండ్ చేశారని, దీనిపై ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఫిర్యాదు మేరకు పకడ్బందీ ప్రణాళికతో ఏసీబీ అధికారులు వల పన్ని దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న సమయంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది. న్యాయస్థానాల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో అవినీతి చోటుచేసుకోవడం తీవ్రంగా పరిగణిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# గాడెస్ ఆఫ్ ఫోక్..
## సమ్మక్క సారలమ్మ జాతర

- ప్రజా భవన్‌లో ఘనంగా ఆవిష్కరించిన మంత్రి సీతక్క
- అరుదైన చిత్రాలతో సుసంపన్నమైన కాఫీ టేబుల్ పుస్తకం
- కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌కు అభినందనలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ప్రజా భవన్‌లో 'గాడెస్ ఆఫ్ ఫోక్ – సమ్మక్క సారలమ్మ జాతర' కాఫీ టేబుల్ పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ పుస్తకాన్ని రూపొందించిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌కు అభినందనలు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరలోని అరుదైన చిత్రాలతో రూపొందించిన ఈ పుస్తకం జాతర వైభవాన్ని ప్రతిబింబిస్తుందని మంత్రి పేర్కొన్నారు. జాతర ఆధ్యాత్మికత, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతీ పుటలో ఆవిష్కరించారని తెలిపారు. ఈ విశిష్ట గ్రంథానికి చిత్రాలను అందించిన ఫోటోగ్రాఫర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి కృషి వల్ల జాతరలోని అద్భుత క్షణాలు శాశ్వతంగా నిలిచిపోయాయని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర తెలంగాణ గర్వకారణమని, గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇటువంటి ప్రచురణలు భవిష్యత్ తరాలకు సంస్కృతి, చరిత్రను పరిచయం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

# టార్గెట్ హరీశ్!

## ట్రబుల్ షూటర్ లక్ష్యంగా కవిత అడుగులు

- ఇటీవల 'దెయ్యాలు.. గుంటనక్కలు' అంటూ వ్యాఖ్యలు
- తనను పార్టీలో ఒంటరిగా చేశారంటూ ఆరోపణలు
- నేడు సిద్దిపేట నుంచి పోటీ చేసి గెలుస్తానంటూ శపథం
- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన కవిత వ్యవహారం
- గులాబీ కోటను బద్దలు కొట్టడం సాధ్యమేనా?
- జననేతగా హరీశ్ రావుకు మంచి పేరు
- ప్రతి ఎన్నికల్లోనూ మెజార్టీలో తన రికార్డు తనే బ్రేక్
- మహామహులు సైతం ఓడించలేని నాయకుడిగా పేరు
- కవిత కాన్ఫిడెన్స్ ఏంటి? అంటూ విశ్లేషకుల సందేహం
- పరాభవం తప్పదని, నిర్ణయం మార్చుకోవాలని సూచన

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**



తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కవిత ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీ.. తను పోటీ చేస్తానన్న నియోజకవర్గంపైనే చర్చ జరుగుతోంది. కల్వకుంట్ల కవిత వేయబోయే కొత్త అడుగు ఎటువైపు? సొంత పార్టీ బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత, ఇప్పుడు తన బాణాలను నేరుగా మాజీ మంత్రి హరీశ్ రావు వైపు ఎక్కుపెట్టారు. గత కొన్ని రోజులుగా ఆమె చేస్తున్న వ్యాఖ్యలు, పరోక్ష విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తన తండ్రి కేసీఆర్‌ను 'దేవుడు' అని అభివర్ణిస్తూనే, ఆయన చుట్టూ ఉన్న వారు 'దయ్యాలు, గుంటనక్కలు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు హరీశ్ రావును ఉద్దేశించినవేనని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### హరీశ్ రావే లక్ష్యం..

కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణులను విస్మయానికి గురిచేశాయి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరిగిన అవినీతికి హరీశ్ రావే బాధ్యుడని, ఆయనే 'అవినీతి అనకొండ' అని ఆమె నేరుగా ఆరోపించారు. ప్రాజెక్టు వైఫల్యాల వల్ల తన తండ్రి కేసీఆర్ ఇమేజ్ దెబ్బతిన్నదని, తనను పార్టీలో ఒంటరిని చేయడానికి హరీశ్ రావు కుట్ర పన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కాలంగా పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తనకు ప్రాధాన్యత తగ్గడానికి, సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దాడులకు హరీశ్ రావు అనుచరులే కారణమని ఆమె గట్టిగా నమ్ముతున్నారు.

### సిద్దిపేటే తొలి చాయిస్ అంటూ..

రెండు రోజుల క్రితం కవిత చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చ మొదలైంది. మే నెల మొదటి వారంలో తన కొత్త రాజకీయ పార్టీ పేరును ప్రకటించబోతున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ పార్టీ కేవలం ఉనికి కోసం కాదని, వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పనిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే, అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం ఏమిటంటే.. ఆమె పోటీ చేయబోయే నియోజకవర్గం. 'నా ఫస్ట్ చాయిస్ సిద్దిపేట' అని కవిత ప్రకటించడంతో, హరీశ్ రావు కంచుకోటలో ఆమె పాగా వేయాలని చూస్తున్నట్లు స్పష్టమైంది. నిజామాబాద్ జిల్లా ఆమెకు పట్టున్న ప్రాంతమైనప్పటికీ, హరీశ్‌ను ఆయన సొంత గడ్డపైనే ఢీకొట్టాలనే పట్టుదలతో కవిత ఉన్నట్లు తెలుస్తోంది.

### కవితకు ఎందుకంత కాన్ఫిడెన్స్?

హరీశ్ రావు వంటి బలమైన నేతను ఆయన సొంత నియోజకవర్గంలో ఢీకొట్టడానికి కవితకు ఉన్న ధైర్యం ఏమిటనే చర్చ నడుస్తోంది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ వారసత్వం. సిద్దిపేటను మొదట గులాబీ కోటగా మార్చింది కేసీఆరే. 2004 వరకు ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహించారు. తన తండ్రి పెంచి పోషించిన పాత కేడర్, ఉద్యమకారులు ఇప్పటికీ తన వెంటే ఉంటారని కవిత భావిస్తున్నారు. హరీశ్ రావు బలం కంటే కేసీఆర్ నామమే అక్కడ గెలిపిస్తుందనేది ఆమె వాదన.

### సన్నిహితుల హెచ్చరిక..

కవిత నిర్ణయంపై ఆమె సన్నిహితులు మాత్రం కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పెట్టిన తొలి ఎన్నికల్లోనే, అధ్యక్షురాలు హోదాలో ఉండి హరీశ్ రావు వంటి ఉద్దండుడిపై పోటీ చేసి ఓడిపోతే.. అది పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు హెచ్చరిస్తున్నారు. సిద్దిపేట కంటే సేఫ్ జోన్ అయిన నిజామాబాద్ లేదా బోధన్ నుంచి పోటీ చేయాలని వారు సూచిస్తున్నారు. అయినప్పటికీ, కవిత మాత్రం హరీశ్‌ను రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా సిద్దిపేట పంతం పట్టినట్లు కనిపిస్తోంది.

### కంచుకోటను బద్దలు కొట్టడం సాధ్యమేనా?

సిద్దిపేట అంటేనే హరీశ్ రావు.. హరీశ్ రావు అంటేనే సిద్దిపేట అన్నట్లుగా అక్కడ రాజకీయాలు ఉంటాయి. 2004 నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రతి ఎన్నికలోనూ హరీశ్ రావు తన మెజారిటీని తానే బ్రేక్ చేసుకుంటూ వస్తున్నారు. గతేడాది ఎన్నికల్లో కూడా ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఎవ్వరు పిలిచినా పలికే నాయకుడిగా, నియోజకవర్గంలో ప్రతి గ్రామంపై, ప్రతి ఓటరుపై పట్టున్న నేతగా ఆయనకు పేరుంది. ముఖ్యంగా యువత, మహిళలు హరీశ్‌ను సొంత అన్నలా భావిస్తారు. గతంలో కాంగ్రెస్, టీడీపీలు ఎంతో మంది దిగ్గజాలను హరీశ్‌పై పోటీకి దింపినా, ఆయన మెజారిటీని తగ్గించలేకపోయారు.

## జీఎస్‌టీ మండలి తరహాలో
# భారత్ కృత్రిమ మేధ మండలి

- ఏఐను సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలనకు ఉపయోగించాలి
- కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించాలి
- ఢిల్లీ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

దేశంలో కృత్రిమ మేధ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జీఎస్టీ మండలి తరహాలో భారత్ కృత్రిమ మేధ మండలిని ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన కృత్రిమ మేధ ప్రభావ సదస్సులో పాల్గొన్న ఆయన, ఏఐ రంగానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జాతీయ కృత్రిమ మేధ నిధి ఏర్పాటు అవసరమని సూచించారు. కృత్రిమ మేధను సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలనకు శక్తివంతమైన సాధనంగా వినియోగించాలని ఆయన పేర్కొన్నారు. చిప్ తయారీ, డేటా నిల్వ, భాషా సాంకేతికత, అనువర్తనాలు వంటి రంగాల్లో భారత్ నాయకత్వం సాధించేందుకు స్పష్టమైన కార్యాచరణ అవసరమన్నారు. ఏఐ అభివృద్ధికి జాతీయ స్థాయి కార్యాచరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, హైదరాబాద్‌ను ఆతిథ్య నగరంగా ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. అలాగే ప్రపంచ స్థాయి పరిశోధనలకు అంకితమైన కృత్రిమ మేధ విశ్వవిద్యాలయం, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక గ్రామం ఏర్పాటు చేయాలని సూచించారు. కృత్రిమ మేధ వల్ల ఉద్యోగ నష్టాలు కాకుండా కొత్త అవకాశాలు సృష్టించేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, బలమైన విధానాలు, వ్యూహాత్మక పెట్టుబడులతో భారత్ ఈ రంగంలో ప్రపంచ నాయకుడిగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## దక్షిణాసియాలో వైద్య పర్యాటక కేంద్రంగా
# హైదరాబాద్ అడుగులు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



- తెలంగాణ మెడికల్ టూరిజం సొసైటీ ఏర్పాటు ప్రతిపాదన
- పీపీపీ విధానంలో సమగ్ర వైద్య పర్యాటక కేంద్రానికి ప్రణాళిక
- యాభైకి పైగా గుర్తింపు పొందిన ఆసుపత్రులతో ముందంజ

దక్షిణాసియాలో అత్యంత సమగ్ర వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ముందడుగు వేసింది. సంస్థ నిర్వాహక అధికారి వి. క్రాంతి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి భాగస్వామ్య వర్గాల సమావేశం నిర్వహించి తెలంగాణ మెడికల్ టూరిజం సొసైటీ ఏర్పాటు ప్రతిపాదనపై చర్చించారు. కేంద్ర బడ్జెట్ 2026 కింద పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో సమగ్ర మెడికల్ వ్యాల్యూ టూరిజం హబ్‌ను స్థాపించాలనే ప్రణాళికను ఈ సమావేశంలో ప్రతిపాదించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే యాభైకు పైగా గుర్తింపు పొందిన ఆసుపత్రులు, పన్నెండు వేలకు పైగా పడకల సామర్థ్యం ఉన్న నేపథ్యంలో వైద్య పర్యాటక రంగంలో నగరం వేగంగా ఎదుగుతోందని అధికారులు తెలిపారు. విదేశీ రోగుల ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచస్థాయి వైద్య సేవలు, సౌకర్యాలు, నివాస వసతులు, ప్రయాణ సదుపాయాలను సమగ్రంగా అనుసంధానించే మౌలిక వసతుల అభివృద్ధి అవసరమని పేర్కొన్నారు. సమగ్ర వైద్య పర్యాటక హబ్ ఏర్పాటుతో రాష్ట్రానికి ఆర్థిక లాభాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వైద్య ప్రయాణ రంగంలో హైదరాబాద్ ప్రముఖ స్థానం సంపాదించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. తెలంగాణను వైద్య సేవల గ్లోబల్ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు.

## ఐదు నిమిషాలు చాలు..

..మొదటి పేజీ తరువాయి

నెలలు అవసరమైతే పదిహేను సంవత్సరాలు ఇచ్చినా మీరు ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. మీ పూర్వీకులే హిందువులకు ఏమీ చేయలేకపోయారని, మీరు ఏమి చేస్తారని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తనకు కేవలం ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని రాజాసింగ్ సవాల్ విసిరారు. తాను ఎక్కడికి రావాలో చెప్పాలని, మీ ప్రాంతానికా, మీ ఇంటికా ఎక్కడకు రమ్మంటే అక్కడికి వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ వంటి ఆయుధాలు అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆయన వ్యాఖ్యలను ఖండిస్తుండగా, మరికొందరు మద్దతు తెలుపుతున్నారు. మొత్తం ఘటనపై రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది.

## సిద్దిపేట యువత కోసం
# హరీష్ అన్న ఉద్యోగ యాప్

**వేద న్యూస్, సిద్దిపేట**

సిద్దిపేట యువతీయువకుల కోసం ఉచిత ఆన్‌లైన్ తరగతులు అందించే 'హరీష్ అన్న ఉద్యోగ యాప్'ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడిన ఆయన, ఈ యాప్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మరింత సులభమవుతాయని తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ.. చాలా యాప్‌లు మొదట ఉచితం అంటూ తరువాత రుసుములు వసూలు చేస్తాయని, అయితే ఈ యాప్‌ను సీరియస్‌గా వినియోగించుకుని ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటామని చెప్పడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ఏ పని చేసినా మంచి ఫలితాలు వచ్చినప్పుడే సంతృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. సిద్ధిపేట డిగ్రీ కళాశాలకు చరిత్ర ఉందని, ఇక్కడే కేసీఆర్ చదువుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిని అందించిన కళాశాల ఇదేనని అన్నారు. నాక్‌లో ఏ గ్రేడ్ సాధించేందుకు సిబ్బంది, ప్రిన్సిపాల్ కృషి అభినందనీయమన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు 95 శాతం ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నారని, వ్యాపారాల వైపు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. సిద్ధిపేటను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, ఒక ప్రభుత్వ ఐటిఐ, వైద్య కళాశాలలను తీసుకువచ్చినట్లు తెలిపారు. రెండు వైద్య కళాశాలలు, రెండు నర్సింగ్ కళాశాలలు, రెండు పారా మెడికల్ కళాశాలలు, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఐటీ టవర్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా సాంకేతికతను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఒక సంవత్సరం కష్టపడి చదివితే జీవితం మారిపోతుందని, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగాలని ప్రేరేపించారు. ఈ యాప్ యువత జీవితాలను మారుస్తుందని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కార్యకర్తలే మా బలం



- ప్రజా క్షేత్రంలోనే పాలన
- తుంబూరు దయాకర్ రెడ్డి
- ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత కార్యాలయ ప్రారంభం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు సాయి గణేష్ నగర్‌లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారం అంటే పదవిలో ఉండటం మాత్రమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పని చేయడమే ముఖ్యమన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యాలయం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే సేవా కేంద్రంగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ, తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండ

**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలంలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ పరిధిలో లింగం బంజరా గ్రామానికి చెందిన మెట్టల రవి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు మాజీ ఎంపీటీసీ అజ్మీరా నారాయణ రూ.5వేలు, విశ్వనాథపల్లి సర్పంచ్ ఇస్లావత్ రాజు నాయక్ రూ.4వేలు నగదు సహాయం అందజేశారు. మొత్తం రూ.9వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురవరపు విష్ణువర్ధన్ రెడ్డి, మాలోత్ బావుసింగ్, వాంకుడోత్ గన్య, బానోత్ హతిరం, హాట్కార్ రాంబాబు నాయక్, కమర్ మల్లయ్య, కాంచన వెంకన్న, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# పద్మాక్షి లేడీస్ హాస్టల్‌లో సమస్యలు




- విద్యార్థుల ఆందోళన
- యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీలోని పద్మాక్షి లేడీస్ హాస్టల్ సి బ్లాక్‌లో గత మూడు నెలలుగా నీటి సరఫరా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సమస్యపై ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ, సమస్యను హాస్టల్ డైరెక్టర్, రిజిస్ట్రార్, ఇతర అధికారులకు పలుమార్లు తెలియజేసినా స్పందన లేదన్నారు. నీటి కోసం విద్యార్థులు ఇతర హాస్టళ్లకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్‌లో వాష్‌రూమ్‌లు, శుభ్రత సదుపాయాలు కూడా సరిగా లేవని ఆరోపించారు. ధర్నా సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం విద్యార్థులతో మాట్లాడి, రెండు మూడు రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే సమస్యలు త్వరగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సీట్లలో ఒకటి బీసీలకు ఇవ్వాలి

- కాంగ్రెస్ బీసీ జేఏసీ విజ్ఞప్తి

**వేద న్యూస్, దామరచర్ల:**

తెలంగాణలో త్వరలో భర్తీ కానున్న రెండు రాజ్యసభ సీట్లలో ఒకటిని బీసీలకు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానానికి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, సామాజిక న్యాయం పాటిస్తూ బీసీలకు రాజ్యసభలో అవకాశం కల్పించాలని కోరారు. బీసీల సమస్యల కోసం నిరంతరం పోరాడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్‌లలో ఒకరికి అవకాశం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదేశి రాజేందర్, వెంకటేశ్ వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# పేదల సొంతింటి కల సాకారం

వేద న్యూస్, కారేపల్లి: భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వాంకుడోత్ అల్లుప్రసాద్-అనుష దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గుగులోత్ హర్ష నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించగా, మిగిలిన ఇళ్ల గృహ ప్రవేశాలు కూడా త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంద్ర అనిల్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.



- కాంగ్రెస్ పార్టీ నాయకుడు హర్ష నాయక్

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- అధికారులు హెచ్చరిక



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి నాగేల్లి బాబు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాల వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తడంతో పాటు విద్యావకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే లింగ వివక్ష పెరగడానికి కూడా ఇది కారణమవుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1098 (చైల్డ్‌లైన్) లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో బాల గంగాధర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత ఫిజియోథెరపీ సద్వినియోగం చేసుకోండి

- గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న



**వేద న్యూస్, కారేపల్లి:**

మిషన్ వాక్ ఫౌండేషన్, మిషన్ వాక్ న్యూరో రిహాబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రేపు కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచిత ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న తెలిపారు. డాక్టర్ బాధావత్ రవి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఉచితంగా చికిత్స అందించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లలేని పేద రోగులను దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డాక్టర్ రవి న్యూరో రిహాబిలిటేషన్‌లో 15 సంవత్సరాల అనుభవం కలిగి ఉండగా, హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పూణే, జైపూర్, ఢిల్లీ, గురుగ్రామ్, ముంబై వంటి నగరాల్లో ఫిజియోథెరపీ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఆధునిక సాంకేతికతతో పాటు రోబోటిక్ విధానంలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు, పరిసర గ్రామాల వారు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అజ్మీరా వీరన్న కోరారు.

# ‘భోగ్ బండరో’కు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**వేద న్యూస్, కారేపల్లి:**



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ‘భోగ్ బండరో’ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను నిర్వాహకులు ఘనంగా ఆహ్వానించారు. శనివారం సింగరేణి మండల తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించ నున్నారు. సర్పంచ్ బానోత్ హీరాలాల్ నేతృత్వంలోని బృందం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నప్రసాద వితరణ, పూజా కార్యక్రమాల కోసం తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని సేవాలాల్ మహారాజ్ చూపిన శాంతి, అహింసా మార్గాలను స్మరించుకున్నారు.

# బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలి

- బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలి
- బీసీ జేఏసీ విజ్ఞప్తి



**వేద న్యూస్, దామరచర్ల:**

రాబోయే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించి, చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏడాది బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని, మహాత్మ జ్యోతిబా పూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అలాగే ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఆ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి బీసీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 15 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో లావుడ్యా జంపన్న, గుడికందుల వీరేశం అనే ఇద్దరు వ్యక్తులు అధికంగా మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని శుక్రవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రెండు రోజుల జైలు శిక్ష విధించగా, హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశం



## - పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్వతు కనకయ్య ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు,కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్యా చిన్న నాయక్, నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గట్టిగుండ్ల విజయ్,లంజపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ షిప్ డివిజన్లో ఐఎన్టీయూసీ ఓట్లే కీలకం

**వేద న్యూస్, జ్యోతి నగర్:**



బాబర్ సలీం పాష పుట్టిన రోజు వేడుకల్లో నూతన కార్పోరేటర్ కొలని కవిత రెడ్డి ని బాబర్ సలీం పాష శాలువతో ఘనంగా సన్మానం చేశారు.రామగుండం ఎన్టీపీసీ పరిధిలో ఇటివల కార్పోరేషన్ ఎన్నికలు జరిగాయి.టౌన్ షిప్ 24వ డివి జన్ లో కొలని కవిత రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్ లో కార్పోరేటర్ గెలవడానికి ఐఎన్టీయూసీ ఓట్లే కీలకంగా మారాయని ఆమె వాఖ్యనించారు.ఐఎన్టీయూసీ యూనియన్ విలువ ఇప్పుడు తెలిసి వచ్చిందన్నారు.గతంలో ఇండిపెండెంట్ గా పోటీ చేసినప్పుడు యూనియన్ విలువ తెలియలేదన్నారు.ఈ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.బాబర్ అశ్శిస్సులు ఉంటే మే అభ్యర్థి గెలవగలడము ఆస్కారం అవుతుందని మరోసారి నిరూపణ అయ్యిందన్నారు.ఈ కార్యక్రమం లో,సువర్తన్ రావు,గోపాలు రావు,భూమళ్ళ చందర్,ఆరపెల్లి రాజేశ్వర్,బొద్దుల రాజేశ్వర్, సత్య నారాయణ తదితరులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144

- నిషేధిత వస్తువులతో సంచరించడం నిషేధం
- డీఎస్పీ నాగేంద్రచారి




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యం లో సిరిసిల్ల సబ్‌డివిజన్ పరిధిలోని 10 పరీక్షా కేంద్రాల వద్ద ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ప్రతిరోజు ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు సెక్షన్ 144 అమల్లో ఉంటుందని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. సెక్షన్ 144 అమల్లో ఉన్న సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడరాదు. నిషేధిత వస్తువులతో సంచరించడం నిషేధం. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు మూసివేయాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# యూరియా యాప్ ను రాజకీయం చేయొద్దు

## - యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు హింగే శ్రీకాంత్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌ను రాజకీయం చేయవద్దని యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు హింగే శ్రీకాంత్ ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. వరుసగా ఎన్నికలలో ఎదురైన ఓటములను జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ప్రతిపక్షాలు యూరియా యాప్‌ను సాకుగా ఉపయోగిస్తున్నాయని ఆరోపించారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ఫలితాలను అంగీకరించలేక కొంతమంది నాయకులు రైతుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉందని.. బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయడమే యాప్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. సాగు భూమి వివరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ జరిగే విధంగా యాప్‌ను రూపొందించారని తెలిపారు. రైతులు ఇంటి వద్ద నుంచే ఆన్లైన్‌లో యూరియా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించడం ద్వారా పారదర్శకత పెరిగిందని చెప్పారు. అయితే కొంతమంది వాట్సాప్ గ్రూపులు సోషల్ మీడియాలో యూరియా కొరత ఉందని.. తప్పుడు



ప్రచారం చేస్తూ.. చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ.. ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. యాప్ వినియోగంపై అవగాహన లేని రైతులు రైతు వేదికల వద్ద ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. ఆధార్ కార్డు పట్టా పాస్‌బుక్ ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ ఆధారంగా రెండు నిమిషాల్లో నమోదు పూర్తి చేసి.. మరుసటి రోజే యూరియా అందజేస్తున్నారని వివరించారు. ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే ఉద్దేశంతో ప్రచారం చేస్తున్న వారి మాటలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# సెక్యూరిటీ టెండర్లలో అక్రమాలు

- అర్హతలేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టే ప్రయత్నం
- సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గరాజ్




**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి ఏరియాలో అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల నియామకానికి నిర్వహించిన టెండర్లలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి కామెరా దుర్గరాజ్ ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతో అర్హతలేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. మాధవ్ సెక్యూరిటీ సర్వీస్, తిరంగ సెక్యూరిటీ అండ్ అవుట్‌సోర్సింగ్ సర్వీసెస్ సంస్థలకు సరైన ధృవీకరణ పత్రాలు లేవని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియలో పసరా లైసెన్స్, జీఎస్టీ, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి వివరాల్లో అనేక అసంగతాలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్ యాక్ట్-2005 నిబంధనలను పాటించకుండా టెండర్లు కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యవహరించి, పూర్తి అర్హతలు ఉన్న సంస్థలకే టెండర్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై మందమర్రి జనరల్ మేనేజర్ వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో పలువురి చేరిక




**వేద న్యూస్, కాజీపేట:**

## - గ్రేటర్ వరంగల్ ట్రైసిటీలో త్వరలో కమిటీలు

తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు చేరారు. గ్రేటర్ వరంగల్ ట్రైసిటీ అధ్యక్షుడు అయినవోలు మల్లికార్జున శాస్త్రి, కార్యదర్శి రమేష్ బాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కాజీపేట వీడియో పాయింట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున శాస్త్రి మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు త్వరలో గ్రేటర్ వరంగల్ ట్రైసిటీకి సంబంధించిన పూర్తి కమిటీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 20 డివిజన్ల అధ్యక్షుల పేర్లను ఖరారు చేసి రాష్ట్ర కమిటీకి పంపినట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, రానున్న గ్రేటర్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పోటీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఉంటుందని, యువత పెద్ద ఎత్తున చేరేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో వంగపల్లి రమేష్, విజయ్ కుమార్, సమ్మయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# పీఎంశ్రీ స్కూళ్లలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

## - ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా విద్యాధికారి, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 16 పాఠశాలలు పీఎంశ్రీ కింద ఎంపిక కాగా, అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, వర్షపు నీటి ఇంకుడు గుంతలు తదితర పనులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా విద్యాధికారి తరచూ పాఠశాలలను పరిశీలించాలని, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణ రావు, ఏఈలు నాగరాజు, అశోక్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబర్ సలీం పాష పుట్టిన రోజు వేడుకలు

**వేద న్యూస్, జ్యోతినగర్:**

రామగుండం ఎన్టీపీసీ టౌన్ షిప్ ఐఎన్టీయూసీ ఆఫీసులో ఐఎన్టీయూసీ జాతీయ సినియర్ కార్యదర్శి ,ఎన్బీసీ మెంబర్,బాబర్ సలీం పాష పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్మికులు, ఉద్యోగులు,నాయకులు కలిసి బాబర్ కు గజ మాల వేసి,శాలువతో ఘనంగా సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ దేశంలోని కార్మికులకు,ఉద్యోగులకు ఐఎన్టీయూసీ అండంగా ఉంటుందన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీ తోనె సాధ్యమన్నారు.లీడర్ ఎదగడానికి కార్మికుల ఆశ్శీసులు కారణమన్నారు. నా పై నమ్మకంతో నావెంట నడిచె వారికి వారి వెన్నెంటు ఉండి కష్ట సుఖాల్లో పాలుపంచుకొంటానని అన్నారు.కార్యక్రమంలో నూతన కార్పోరేటర్ ,కొలని కతిత రెడ్డి,ఐఎన్టీయూసీ నాయకులు సువర్తన్ రావు,గోపాలు రావు ,భూమళ్ళ చందర్,ఆరపెల్లి రాజేశ్వర్ ,సత్యనారాయణ, తది తరులు ఉన్నారు.



# ఆరోగ్యలక్ష్మి అమలుకు నూతన కమిటీ ఏర్పాటు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట గ్రామంలో ఆరోగ్యలక్ష్మి పథకం సమర్థవంతమైన అమలుకు అంగన్వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయక కమిటీ (ఏఎల్ఎంఎస్‌సి)ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తల్లి, బిడ్డల పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై చర్చించారు. గ్రామ సర్పంచ్ ఎం.రాజు మాట్లాడుతూ, తల్లి-బిడ్డల ఆరోగ్యం గ్రామ అభివృద్ధికి కీలకమని, గ్రామస్థాయి పర్యవేక్షణతో పథకం సమర్థంగా అమలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 12వ వార్డు సభ్యుడు కూనబోయిన రఘు అంగన్వాడీ చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎం స్వప్న, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 21, 2026

# హన్మక్కపల్లిలో చిరుత బీభత్సం..

**– ఆవు దూడపై దాడి..**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లిలో చిరుతపులి కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి రైతు రోమాల భూమయ్యకు చెందిన ఆవు దూడపై చిరుత దాడి చేసి చంపేసింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పాదముద్రలను పరిశీలించగా, ఇది చిరుత దాడేనని నిర్ధారించారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఘటన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు బాధిత రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు.

# బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అజయ్



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల అజయ్ నియమితుల య్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కొప్పుల అజయ్ నియా మకంపై వేములవాడ ప్రాంతానికి చెందిన బీసీ సంఘాల నాయకులు, యువజన ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో బీసీ సంక్షేమం కోసం మరింతగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**– లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై గృహ యజమానులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటి యజ మానులకు నూతన వస్త్రాలు అందజేశారు. పేదల సొంతింటి కలలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 25న ద్విచక్ర వాహనాల వేలం

**– ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గురవయ్య**



**వేద న్యూస్, మంచిర్యాల:**

మంచిర్యాల ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 25న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గురవయ్య తెలిపారు. స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ వేలంలో ఆసక్తి గల వ్యక్తులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. వేలం ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించబడుతుందని తెలిపారు.

# నందన్నకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలి

**– సేవాదళ్ నేత మారుతి బాపూజీ**



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందన్నకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి బాపూజీ ప్రభుత్వాన్ని కోరారు. ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నందన్న జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో నాలుగు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయానికి ఆయన నాయకత్వం కారణమని కొనియాడారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలను ఐక్యం చేసి పార్టీని బలోపేతం చేసిన నందన్న సేవలను గుర్తించి, ఆయనకు తగిన కార్పొరేషన్ పదవి ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# పుష్కర ఘాట్లను పరిశీలించిన అధికారులు



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

రానున్న పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి, మూలరాంపూర్, యామపూర్ గ్రామాల పుష్కర ఘాట్లను అధికారులు పరిశీలించారు. మండల తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్, ఎస్సై నవీన్‌లు ఘాట్లను సందర్శించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అలాగే పుష్కరాల నిర్వహణకు అవసరమైన అంచనా వ్యయాలు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాతృభాష మన ప్రాణశ్వాస




**– సిటీ కళాశాలలో బహుభాషా కవిసమ్మేళనం**

**వేద న్యూస్, హైదరాబాద్:**

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సిటీ కళాశాలలో తెలుగు, ఆంగ్లం, హిందీ, సంస్కృతం, ఉర్దూ శాఖల ఆధ్వర్యంలో బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. వివిధ భాషలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ మాతృభాషల ప్రాముఖ్యతను కవితా పఠనం ద్వారా తెలియజేశారు. విద్యార్థులు తమ కవితల ద్వారా భాష, సంస్కృతి పరిరక్షణ అవసరాన్ని చాటి చెప్పారు. చిక్కొంద్ర రవి తెలంగాణ భాష ప్రత్యేకతను ప్రతిబింబించే కవితను వినిపించగా, మహమ్మద్ ఫరూఖి దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించే కవితతో ఆకట్టుకున్నారు. హిందీ, ఆంగ్లం, తెలుగు, మరాఠీ, పర్షియన్, బంజారా భాషల్లో విద్యార్థులు కవితలు వినిపించి మాతృభాష పట్ల తమ అనురాగాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డా. కోయి కోటేశ్వర రావు, డా. రాజేంద్ర కుమార్, డా. ఆది రమేశ్, డా. హక్, డా. కమల సుధ, డా. సుజాత అజ్మీరా తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. వివిధ భాషలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని అధ్యాపకులు అభినందించారు.

# 'పెరుమాండ్ల' మాయాజాలం



- చిట్ ఫండ్ పేరుతో కోట్లు వసూళ్లు
- పిల్లలు చదువు, పెళ్లిళ్ల కోసం దాచుకున్న డబ్బు
- బాధితుల గగ్గోలు.. పోలీసులకు ఫిర్యాదు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలో చిట్ ఫండ్ పేరుతో వందలాది పేద ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన పెరుమాండ్ల కిషోర్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, బహుజన సంక్షేమ సంఘం నాయకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో బాధితులు శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుమాండ్ల చిట్ ఫండ్ పేరుతో కిషోర్ రెడ్డి వందలాది మందిని నమ్మించి కోట్ల రూపాయలు వసూలు చేసి, డబ్బులు తిరిగి ఇవ్వకుండా పరారైనట్లు ఆరోపించారు. పేద ప్రజలు తమ పిల్లల చదువు, పెళ్లిళ్లు, గృహ నిర్మాణం వంటి అవసరాల కోసం దాచుకున్న సొమ్మును చిట్ ఫండ్‌లో పెట్టగా, ఇప్పుడు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్ ఫండ్ ద్వారా సేకరించిన డబ్బులతో కిషోర్ రెడ్డి తన కుటుంబ సభ్యులు, బినామీల పేర్లపై ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆరోపించారు. అతను విదేశాలకు పారిపోకుండా వెంటనే పాస్‌పోర్ట్ రద్దు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు గజ్జి శ్రీనివాస్, సిలువేరు శ్రీనివాస్, పరకాల రవి, రత్నమాల, వినయ్, వీణాచారి, రఘుపతి రెడ్డి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**– పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్**
**– స్వయం సహాయక సంఘ భవనాలకు భూమి పూజ**



**వేద న్యూస్, పాపన్నపేట:**

మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పాపన్నపేటలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న రెండు స్వయం సహాయక సంఘ భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. ఈ భవనాల నిర్మాణం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సద్దాం హుసేన్, వార్డు సభ్యులు రాజు, మాజీ ఉపసర్పంచ్ ఖాలీం, నాయకులు రాములు, సత్యగౌడ్, సంగమేశ్, శివయ్య, వీవోఏలు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మలకపేట యశోదాలో అత్యవసర వైద్య సేవలు




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

మలకపేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణులతో అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నామని కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డా. సూరిశెట్టి భరత్ కుమార్ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల మరముల్ల ప్రియాంక తీవ్ర కండర బలహీనత, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. పరీక్షల్లో తీవ్రమైన పొటాషియం లోపం (హైపోకలేమియా), హైపోకలేమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ వంటి సమస్యలు గుర్తించామని చెప్పారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ, రుమటాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల వైద్యుల సమన్వయంతో చికిత్స అందించామని, నియంత్రిత విధానంలో పొటాషియం స్థాయిలను సరిచేసి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను పునరుద్ధరించామని తెలిపారు. సకాలంలో చికిత్స అందడంతో రోగి కండర బలం మెరుగుపడి, ఆరోగ్యంగా కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు పేర్కొన్నారు. ఈ కేసు ద్వారా యశోదా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణుల సేవలు, 24 గంటల అత్యవసర చికిత్స సామర్థ్యం మరోసారి రుజువైందని డా. భరత్ కుమార్ తెలిపారు.

# రెసిడెన్షియల్ పాఠశాలలో అకాడమిక్ పరిశీలన



**వేద న్యూస్, ఆదిలాబాద్ ప్రతినిధి:**

ఎస్ఎస్ఏ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అకాడమిక్ పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓ బి. లక్ష్మణ్, అసిస్టెంట్ ఏఎంఓ అజయ్ పాఠశాల నిర్వహణ, బోధనా విధానాలను సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదుల్లో బోధనను ప్రత్యక్షంగా వీక్షించిన అధికారులు, ఉపాధ్యాయులకు బోధన నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించే విధానాలపై మార్గదర్శకాలు అందించారు. అలాగే పాఠశాల వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు రవికాంత్ రెడ్డి, గణేష్, హారిక పాల్గొన్నారు.

వేద న్యూస్



# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జవాబుదారితనంతో పనిచేయాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

పదోన్నతి పొందిన ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఖమ్మం రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందిన 15 మంది ఉద్యోగులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి నియామక పత్రాలను అందజేశారు. నాలుగో తరగతి సిబ్బంది, డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వీరు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, డ్రాఫ్టింగ్, కంప్యూటర్ వినియోగంపై పట్టు సాధించాలని సూచించారు. పారదర్శకంగా, త్వరితగతిన ప్రజా సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. పదోన్నతి పొందిన ఉద్యోగులను తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెసా సభ్యులు, కలెక్టరేట్ అధికారులు, పదోన్నతి పొందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అండగా ఉంటాం



- ప్రముఖ నాయకుడు రమేష్ బాబు

**వేద న్యూస్, కారేపల్లి:**

గ్రామ అభివృద్ధిలో భాగస్వాములుగా నిలుస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రముఖ నాయకులు పటేల్ బాబు సోదరుడి కుమారుడు రమేష్ బాబు అన్నారు. శుక్రవారం గాదేపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రంజిత్ కుమార్, గ్రామ పెద్దలు రమేష్ బాబుకు స్వాగతం పలికి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అవసరాలపై చర్చించారు. గ్రామంలో కృష్ణుడి ఆలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ మరియు గ్రామ పెద్దలు ఆయనను కోరారు. దీనిపై రమేష్ బాబు సానుకూలంగా స్పందిస్తూ, ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలం విషయమై తన తండ్రితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# ముక్కు మూసుకో.. ఉగ్గ బట్టుకో..!

- ☐ నల్లబెల్లి పాఠశాలలో అధ్వాన్నంగా మరుగుదొడ్లు
- ☐ దుర్వాసనతో విద్యార్థుల ఇబ్బందులు
- ☐ పట్టించుకోవాలని అధికారులకు వేడుకోలు



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో తీవ్రమైన దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ఈ దుర్వాసనలు పాఠశాల పరిసర ప్రాంతాలకు వ్యాపించి, తరగతి గదుల వరకు చేరడంతో విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీ కరించలేక పోతున్నారు. దుర్వాసనల కారణంగా కొందరు విద్యార్థులు తలనొప్పి, వాంతులు వంటి ఆరోగ్య సమస్యలకు గురవుతున్నట్లు సమాచారం. పరిశుభ్రత లోపం వల్ల పాఠశాల వాతావరణం కలుషితం అవుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా పాఠశాల అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని ఆరో పిస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. మరుగుదొడ్లను శుభ్రపరచడంతో పాటు, అవసరమైతే కొత్తగా నిర్మించి, క్రమం తప్పకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సురక్షిత త్రాగునీరు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు హాజరు శాతం పెరిగి, అభ్యాసం మెరుగు పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి పాఠశాలలో తక్షణమే స్వచ్ఛతా చర్యలు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# చిట్ ఫండ్ పేరుతో మోసం

- అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి డబ్బులు వసూలు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలో చిట్ ఫండ్ పేరుతో పలువురిని మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. శాయంపేట సీఐ రంజిత్ రావు తెలిపిన వివరాల ప్రకారం, పత్తిపాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల కిషోర్ రెడ్డి పెరుమాండ్ల చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట చిట్టీలు నిర్వహిస్తూ అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి పలువురి నుంచి డబ్బులు సేకరించాడు. పత్తిపాక, శాయంపేట, ఆరేపల్లి గ్రామాలకు చెందిన బాధితులు మొత్తం రూ.5,29,500లను కిషోర్ రెడ్డికి చెల్లించారు. అయితే చిట్టి కాలపరిమితి ముగిసిన తర్వాత డబ్బులు అడగగా ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కిషోర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ రంజిత్ రావు తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# వాటర్ ట్యాంకులను పరిశీలించిన అధికారులు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్, రామాలయం సమీపంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులను శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. ట్యాంకుల భద్రత, స్థిరత్వాన్ని అంచనా వేయడానికి ఎన్‌ఏబిఎల్ ఆధ్వర్యంలో యూపీవీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా ట్యాంకుల నిర్మాణ స్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్, ఈఈ మోహన మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**వేద న్యూస్, చందుర్తి:**



చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో శ్రీ హనుమాన్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోతరాజు భారతి-నగేష్ ఆధ్వర్యంలో అర్చకులు పవన్ శర్మ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు అందరూ సహకరించడం అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణు, ఆలయ కమిటీ అధ్యక్షులు బొడ్డు భూమయ్య, వైస్ చైర్మన్ కొత్త శ్రీనివాసరెడ్డి, నాయకులు గుడిసె రమేష్, బుర్ల మల్లేశం, వెంకటేశం, లచ్చిరెడ్డి, బత్తుల సురేష్, రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, ముత్తయ్య, శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రఘునందన్ దిష్టిబొమ్మ దహనం

- బీసీ ద్రోహి అంటూ ముదిరాజ్ సంఘాల నిరసన



**వేద న్యూస్, కరీంనగర్:**

బీజేపీ ఎంపీ రఘునందన్ రావును 'బీసీ ద్రోహి'గా అభివర్ణిస్తూ పెద్దమ్మ తల్లి అర్బన్ ముదిరాజ్ కుల సంక్షేమ సంఘం, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ గీతాభవన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు రఘునందన్ రావు దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో జరిగిన చైర్మన్ ఎన్నికల సందర్భంగా బీసీ అభ్యర్థి నీలం కవిత-మధు ముదిరాజ్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడం బీసీ సమాజానికి అన్యాయం చేశారని ఆరోపించారు. బీసీ ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. బీసీ హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు చిక్కుడు రాజయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నిమ్మల కిషన్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి ఎరవేణి రామాంజనేయులు, టీ.ఎం.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు కూనచ్చుల మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదం

- దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో మంటలు
- అదుపులోకి తెచ్చిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

**వేద న్యూస్, మడికొండ:**



మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో చెట్లలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో వెంటనే హనుమకొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఫైర్ టెండర్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాద సమయంలో మహిళా ప్రాంగణంలో సుమారు 100 మంది నర్సింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు ఉండటం గమనార్హం. మహిళా ప్రాంగణం వెనుక భాగంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల కూడా ఉండటంతో ప్రమాదం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉన్నప్పటికీ, పోలీసులు, ఫైర్ సిబ్బంది సమయానికి స్పందించి పెద్ద ప్రమాదాన్ని నివారించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదు. సమయానికి స్పందించి మంటలను అదుపులోకి తెచ్చిన పోలీస్ మరియు ఫైర్ సిబ్బందిని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు అభినందించారు.

# దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకుంటుంది

**వేద న్యూస్ ఇల్లంతకుంట,**



దివ్యాంగులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గకేంద్ర కార్యాలయంలో శుక్రవారం నర్సక్కపేట గ్రామానికి చెందిన రాగటి శ్రీనివాస్, రాగటి శ్రావణ్‌లకు ద్విచక్ర వాహనాలను వికలాంగసంస్థ ద్వారా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు అంగవైఖల్యం ఉందని ఎవరు అధైర్యపడవద్దని, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను అనేక మంది దివ్యాంగులు సాధించారని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు వివిద గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# జగన్‌ను కలిసిన అంబటి రాంబాబు

- తాడేపల్లిలో కీలక భేటీ.. రాజకీయ పరిస్థితులపై చర్చ
- తప్పుడు కేసులకు భయపడొద్దని జగన్ భరోసా
- ప్రజా పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపు



**వేద న్యూస్ అమరావతి:**

ఇటీవల బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కేసుల వ్యవహారం తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పెడుతున్న కేసులపై ఆందోళన చెందవద్దని జగన్ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్ని కేసులు పెట్టినా చట్టపరంగా ఎదుర్కొందామని, న్యాయపరమైన పోరాటంతో ముందుకు సాగాలని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని అంబటి రాంబాబుకు సూచించినట్లు సమాచారం. కొంతమంది పోలీసు అధికారుల వ్యవహారశైలిపై జగన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ భేటీలో మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర

- మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళి
- తెనాలిలో రచ్చబండకు ప్రజల అశేష స్పందన
- గ్రామీణాభివృద్ధిలో ఉపాధి హామీ చట్టం పాత్ర వివరణ

**వేద న్యూస్ అమరావతి:**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర నేడు గుంటూరు జిల్లాలో కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ షర్మిల ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం తెనాలి పట్టణంలో రచ్చ బండ నిర్వహించగా నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం పాత్రను వివరించారు. ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజుల పని హక్కుగా మారిందని, గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గాయని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ చట్టం దోహదపడిందని వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన కొత్త పథకం వల్ల గ్రామీణ కార్మికులకు నష్టం కలిగే అవకాశం ఉందని యాత్రలో అవగాహన కల్పించారు. ఉపాధి హామీ చట్టాన్ని గాంధీజీ పేరుతోనే కొనసాగించాలని శ్రామికులు డిమాండ్ చేసినట్లు తెలిపారు.



గ్రామీణ ప్రజల జీవనోపాధిని కాపాడేందుకు ఈ యాత్ర కొనసాగుతుందని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

- మాతృభాష పరిరక్షణ తరతరాలకు వారసత్వం
- స్వభాషలో విద్య ఆలోచనా వికాసానికి బలమైన పునాది
- ప్రతి భాషకు సమాన గౌరవం ప్రపంచ ఐక్యతకు మార్గం

**వేద న్యూస్ డెస్క్:**

భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు; అది మన ఆత్మ. మన ఆలోచనలకు రూపం ఇచ్చేది, మన సంస్కృతిని మోసుకెళ్లేది, మన భావోద్వేగాలకు అర్థం ఇచ్చేది మాతృభాష. ఈ గొప్ప విలువను గుర్తు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే రోజే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం. భాషా వైవిధ్యాన్ని కాపాడటం, మాతృభాషల పరిరక్షణకు అవగాహన పెంపొందించడం, ప్రతి భాషకు గౌరవం ఇవ్వడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యాలు.

ప్రపంచంలో వేలాది భాషలు జీవిస్తున్నాయి. ప్రతి భాష వెనుక ఒక చరిత్ర ఉంది, ఒక జీవన విధానం ఉంది, ఒక సాంస్కృతిక సంపద ఉంది. కానీ ఆధునిక ప్రపంచీకరణ, నగరీకరణ, సాంకేతిక ఆధిపత్యం కారణంగా అనేక చిన్న భాషలు కనుమరుగైపోతున్నాయి. ఒక భాష అంతరించిపోతే ఆ భాషతో పాటు ఒక సమాజపు జ్ఞాపకాలు, సంప్రదాయాలు, జానపద జ్ఞానం కూడా కనుమరుగవుతుంది. అందుకే భాషా పరిరక్షణ ఒక సామూహిక బాధ్యతగా మారింది.

మాతృభాషలో విద్య పొందడం ఒక బలమైన పునాది. చిన్నారులు తమ మాతృభాషలో నేర్చుకున్నప్పుడు ఆలోచన స్పష్టంగా అభివృద్ధి చెందుతుంది. భావ వ్యక్తీకరణ సులభమవుతుంది. విజ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. అదే సమయంలో ఇతర భాషలను నేర్చుకోవడం కూడా అవసరం. ప్రపంచంతో మమేకం కావాలంటే బహుభాషా పరిజ్ఞానం అవసరం. కానీ స్వభాషను విస్మరించడం సరైంది కాదు. మాతృభాషపై గౌరవం ఉన్నప్పుడే వ్యక్తిత్వం బలపడుతుంది.

భాషా వైవిధ్యం ప్రపంచ సంపద. భిన్న భాషలు భిన్న ఆలోచనా విధానాలను అందిస్తాయి. సంస్కృతుల మధ్య అవగాహన పెంపొందించడంలో భాష కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి భాషకు సమాన గౌరవం ఇవ్వడం ద్వారా పరస్పర గౌరవం పెరుగుతుంది. మాతృభాషా దినోత్సవం ఈ విలువను ప్రపంచానికి గుర్తు చేస్తుంది. చిన్న భాషల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచిస్తుంది. నేటి డిజిటల్ యుగంలో భాషా పరిరక్షణకు సాంకేతిక వనరులు ఉపయోగపడాలి. పుస్తకాలు, సాహిత్యం, జానపద గేయాలు, కథలు డిజిటల్ రూపంలో భద్రపరచాలి. యువతలో మాతృభాషపై ఆసక్తి పెంపొందించాలి.

కుటుంబాలు పిల్లలకు మాతృభాషలోనే సంభాషణ చేయాలి. పాఠశాలలు భాషా వారసత్వాన్ని బోధించాలి. ప్రభుత్వాలు భాషా అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. భాష మన గౌరవానికి ప్రతీక. స్వభాషలో మాట్లాడడం చిన్నదనం కాదు; అది గర్వకారణం. ప్రపంచంతో కలిసిపోతూనే మన మూలాలను మర్చిపోకూడదు. భాష బతికుంటే సంస్కృతి బతుకుతుంది. సంస్కృతి బతికుంటే సమాజం బలపడుతుంది. అందుకే మాతృభాషను ప్రేమించాలి, పరిరక్షించాలి, తరతరాలకు అందించాలి. మొత్తంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మన మూలాలను గుర్తు చేసే సందర్భంగా నిలుస్తుంది.

భాషా వైవిధ్యాన్ని కాపాడటం ద్వారా ప్రపంచ ఐక్యతను బలోపేతం చేయవచ్చు. ప్రతి భాష ఒక ప్రపంచం. ఆ ప్రపంచాన్ని గౌరవించడం మన బాధ్యత. మాతృభాషపై ప్రేమ, గౌరవం, పరిరక్షణ ఇవే ఈ దినోత్సవం అందించే అసలైన సందేశం. మాతృభాషలో విద్య పొందినప్పుడు ఆలోచన స్పష్టంగా అభివృద్ధి చెందుతుంది. చిన్న వయసులోనే మాతృభాషపై పట్టు పెరిగితే విజ్ఞానార్జన సులభమవుతుంది. అదే సమయంలో ఇతర భాషలను నేర్చుకోవడం కూడా అవసరం. కానీ మాతృభాషను విస్మరించడం సరైంది కాదు. స్వభాషపై గౌరవం ఉంటేనే వ్యక్తిత్వం బలపడుతుంది.

భాషా వైవిధ్యం ప్రపంచ సంపద. భిన్న భాషలు భిన్న దృక్పథాలను అందిస్తాయి. సంభాషణ ద్వారా సంస్కృతుల మధ్య అవగాహన పెరుగుతుంది. పరస్పర గౌరవం పెరుగుతుంది. మాతృభాషా దినోత్సవం ఈ ఐక్యతను గుర్తు చేస్తుంది. ప్రతి భాషకు సమాన గౌరవం ఇవ్వాలని సందేశం ఇస్తుంది.నేటి డిజిటల్ యుగంలో భాషా పరిరక్షణకు సాంకేతిక వనరులను వినియోగించుకోవాలి. పుస్తకాలు, సాహిత్యం, జానపద సంపదను భద్రపరచాలి.

# ఫోన్‌పేలో సరికొత్త ఫీచర్

## పిన్ లేకుండానే యూపీఐ లావాదేవీలు




**వేద న్యూస్ డెస్క్:**

దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులకు మరింత సౌకర్యం, వేగం మరియు భద్రతను అందించేందుకు ఫోన్‌పే సంస్థ సరికొత్త సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు యూపీఐ ద్వారా ప్రతి లావాదేవీ పూర్తిచేయాలంటే వినియోగదారులు తప్పనిసరిగా పిన్ నమోదు చేయాల్సి ఉండేది. అయితే ఇకపై చిన్న మొత్తాల లావాదేవీలకు పిన్ అవసరం లేకుండానే వేలిముద్ర లేదా ముఖ గుర్తింపు ద్వారా చెల్లింపులు పూర్తి చేసుకునే వీలును సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. బయోమెట్రిక్ ధృవీకరణ విధానాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన ఈ సదుపాయం ప్రాథమికంగా ఐదు వేల రూపాయల లోపు లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. దీనివల్ల తరచూ చిన్న మొత్తాలు చెల్లించే వినియోగదారులకు వేగవంతమైన సేవ అందుబాటులోకి రానుంది. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలంటే ఫోన్‌పే యాప్‌లో ప్రొఫైల్ విభాగంలోకి వెళ్లి చెల్లింపుల నిర్వహణ ఎంపికలో బయోమెట్రిక్ చెల్లింపు గుర్తును ప్రారంభించాలి. ఒకసారి ఈ ఎంపికను ప్రారంభించిన తర్వాత మొబైల్ ఫోన్‌లో ఇప్పటికే నమోదైన వేలిముద్ర లేదా ముఖ గుర్తింపు ఆధారంగా చెల్లింపులు సులభంగా పూర్తవుతాయి. ముఖ్యంగా చిన్నచిన్న కొనుగోళ్లు, దుకాణాల్లో తక్షణ చెల్లింపులు, రోజువారీ ఖర్చుల విషయంలో ఈ విధానం సమయాన్ని ఆదా చేయడంతో పాటు వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరుస్తుందని సంస్థ పేర్కొంది. సాంకేతిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, పిన్ మాత్రమే ఆధారపడే విధానంతో పోలిస్తే బయోమెట్రిక్ ధృవీకరణను జోడించడం భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తుంది. ఇతరులు పిన్ తెలుసుకున్నా, వేలిముద్ర లేదా ముఖ గుర్తింపు లేకుండా లావాదేవీ పూర్తి చేయడం సాధ్యం కాదు. దీనివల్ల మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. అయితే ఐదు వేల రూపాయలకు మించిన లావాదేవీలకు ఇప్పటిలాగే పిన్ నమోదు తప్పనిసరి అవుతుంది. డిజిటల్ చెల్లింపుల్లో వేగం, సౌలభ్యం, భద్రత అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ ఫోన్‌పే ఈ సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్టు తెలుస్తోంది. దేశంలో నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో ఇలాంటి సాంకేతిక మార్పులు వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు డిజిటల్ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరుస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు.

# స్విగ్గీ 'స్నాక్' 10 నిమిషాల డెలివరీ ఎందుకు విఫలమైంది

**వేద న్యూస్ డెస్క్:**



భారతదేశంలో క్విక్ కామర్స్ రంగంలో వేగంగా పెరుగుతున్న డిమాండ్ మధ్య, ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ 10 నుంచి 15 నిమిషాల్లో స్నాక్స్, పానీయాలను డెలివరీ చేయించే 'స్నాక్' యాప్‌ను ఆర్భాటంగా ప్రారంభించింది. అయితే, 2025 జనవరిలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ 15 నెలల్లోనూ ఆర్థికంగా నిలదొక్కుకోలేక, కంపెనీ అధికారికంగా దీన్ని మూసివేసింది. స్విగ్గీ సాధారణ యాప్‌లో ఫుడ్ ఆర్డర్ చేస్తే రెస్టారెంట్‌లో తయారవ్వడానికి 30 నుండి 40 నిమిషాలు పడుతుందే, 'స్నాక్' యాప్‌లో రెడీ-టు-ఈట్ పదార్థాలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో సొంత హబ్‌లలో నిల్వ చేసి, ఆర్డర్ వచ్చిన వెంటనే డెలివరీ చేయడం జరుగుతుండేది. బెంగళూరు, గురుగ్రామ్, నోయిడా వంటి నగరాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైనా, నిర్వహణ ఖర్చులు, రైడర్ల లభ్యత, ఆహార పదార్థాల వృధా వంటి సమస్యల వల్ల లాభాలు రావడంలో విఫలమైంది. కస్టమర్లు అత్యవసరంగా కిరాణా సామాగ్రి మాత్రమే కోరడంలో, 10 నిమిషాల వేగవంతమైన స్నాక్ డెలివరీకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వలేదు. 2026 మూడో త్రైమాసికంలో స్విగ్గీ నికర నష్టంగా రూ. 1,065 కోట్లను నమోదు చేసింది. ఆదాయం 54 శాతం పెరిగినప్పటికీ, ఖర్చులు కూడా భారీగా పెరగడం, ఇన్వెస్టర్ల ఒత్తిడి కంపెనీని ప్రధాన ఫుడ్ డెలివరీ వ్యాపారంపై దృష్టి పెట్టమని నిర్ణయం తీసుకోవడంలో ప్రధాన కారణమైంది. స్విగ్గీ ప్రధాన వ్యాపారం 20.5 శాతం వృద్ధిని చూపించగా, జెప్టో, జోమాటో వంటి ఇతర ఫుడ్ డెలివరీ కంపెనీలు కూడా త్వరిత డెలివరీ సర్వీసుల్లో సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

# ప్రభుత్వ ఉద్యోగులకు హోలీ గిఫ్ట్ పెరగనున్న శాలరీలు?




**వేద న్యూస్ డెస్క్:**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు 2026 హోలీ పండగ సందర్భంగా ప్రస్తుత డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) పెంపుపై కేంద్రం ప్రకటన చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ద్రవ్యోల్బణ గణాంకాల ప్రకారం డీఏ మరో 2 శాతం పెరుగుతూ 58 శాతం నుంచి 60 శాతం స్థాయికి చేరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు, జనవరి మరియు జూలై నెలల్లో డీఏ సవరణను చేస్తుంది. అయితే, పండగ సమయానికి అనుగుణంగా ఈసారి మార్చి మొదటి వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలపవచ్చని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 7వ పే కమిషన్ గడువు 2025 డిసెంబరు 31న ముగిసిన తర్వాత 8వ పే కమిషన్ ఏర్పాటు ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలో ఉంది. కొత్త పే కమిషన్ అమలు అయ్యే వరకు ఉద్యోగుల జీతాలను పెంచడానికి డీఏ సవరణ ప్రధాన మార్గంగా ఉంటుంది. డిసెంబర్ 2025 గణాంకాల ప్రకారం ఇండెక్స్ 148.2 వద్ద స్థిరంగా ఉంది. గత 12 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటే, ఈసారి డీఏ 60 శాతం వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఎప్పుడూ రౌండ్ ఫిగర్‌ను మాత్రమే తీసుకునే కారణంగా, డీఏ 60 శాతం ఖాయమని విశ్లేషకులు చెప్పుతున్నారు. ఉదాహరణకు ఒక సాధారణ గ్రూప్ డి ఉద్యోగి బేసిక్ శాలరీ రూ. 18,000 అయితే, 58% డీఏ ఉన్నప్పుడు మొత్తం జీతం రూ. 28,440 అవుతుంది. డీఏ 60% పెరిగినప్పుడు మొత్తం జీతం రూ. 28,800కు చేరుతుంది. అంటే నెలకు రూ. 360 మాత్రమే కాకుండా, పెరిగిన డీఏ ప్రభావం హెచ్‌ఆర్‌ఏ వంటి ఇతర అలవెన్సులపై కూడా పడుతుంది.

వేద న్యూస్


# కృతి సనన్, రష్మిక పాత్రలపై సంచలన సమాచారం?

**వేద న్యూస్ డెస్క్:**

వరుస విజయాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మిక మందన్న మరో ప్రయోగాత్మక పాత్రతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. హిందీ చిత్రసీమలో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో ఆమె పోషిస్తున్న పాత్రపై ప్రస్తుతం సినీ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఈ చిత్రంలో కథానాయకుడిగా షాహిద్ కపూర్ నటిస్తుండగా, రష్మికతో పాటు కృతి సనన్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాలో రష్మిక, కృతి పాత్రలు ఒక విభిన్న కోణంలో చూపించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నారనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపిస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఇదొక విభిన్నమైన త్రిభుజ ప్రేమకథగా రూపుదిద్దుకుంటోందని, ముఖ్యంగా రష్మిక, కృతి మధ్య ఉండే భావోద్వేగాలు, అనుబంధం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి హోమీ అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ జనవరి 31తో పూర్తయినట్లు సమాచారం. 2012లో విడుదలై మంచి విజయాన్ని సాధించిన 'కాక్‌టెయిల్ 2' చిత్రానికి ఇది కొనసాగింపుగా వస్తోంది. ఆ చిత్రంలో సైఫ్



అలీ ఖాన్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలు పోషించారు. ఈసారి కథలో కొత్త మలుపులు, సరికొత్త పాత్ర చిత్రణలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా షాహిద్ కపూర్ ఇప్పటివరకు చూడని కొత్త రూపంలో కనిపించనున్నారని దర్శకుడు పేర్కొన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన ప్రతిభను చాటుకుంటున్న రష్మికకు ఈ చిత్రం హిందీ చిత్రసీమలో మరో కీలక అవకాశాన్ని అందిస్తుందా అన్నది విడుదల తర్వాత స్పష్టమవుతుంది.

# విలన్‌గా సుహాస్ ఎంట్రీ

**వేద న్యూస్ డెస్క్:**




తెలుగులో హీరోగా వరుస విజయాల తో ముందుకు సాగుతున్న సుహాస్ తన సినీ ప్రయాణంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తమిళ నటుడు సూరి కథానాయకుడిగా నటిస్తున్న మండాడి చిత్రంలో సుహాస్ ప్రధాన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. సముద్రం నేపథ్యంగా సాగే శక్తివంతమైన యాక్షన్ నాటకంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటివరకు ఎక్కువగా పక్కా మధ్యతరగతి యువకుడి పాత్రల్లో, హాస్యంతో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథల్లో కనిపించిన సుహాస్, ఈసారి పూర్తి భిన్నంగా ప్రతినాయక ఛాయలతో కూడిన పాత్రను ఎంచుకోవడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కథలో అతని పాత్ర బలమైన ప్రతిబంధకంగా నిలుస్తుందని, కథానాయకుడితో ఎదురెదురుగా సాగే ఘర్షణ సన్నివేశాలు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సమాచారం. సుమారు డెబ్బై ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ చిత్రానికి మతిమారన్ పుహళేంది దర్శకత్వం వహిస్తున్నారు. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో, విస్తృత స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ ఏడాది వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. తెలుగులో హీరోగా తనదైన గుర్తింపు సంపాదించిన సుహాస్, తమిళంలో ప్రతినాయకుడిగా ఎలా మెప్పిస్తాడన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం ఆయనకు దక్షిణ భారత చిత్రసీమలో కొత్త మార్గాలు తెరుస్తుందా అన్నది విడుదల తర్వాత తేలనుంది.

# నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది - ప్రభాస్

**వేద న్యూస్ డెస్క్:**

రెబల్ స్టార్ ప్రభాస్ వ్యక్తిగత జీవితంపై ఇప్పటివరకు ఎక్కువగా మాట్లాడని ఆయన, తాజాగా ప్రేమపై తన మనసులోని భావాలను బయటపెట్టి అభిమానులను ఆశ్చర్యానికి గురి చేశారు. పెళ్లి విషయంపై గతంలో ఎన్నోసార్లు ప్రశ్నలు ఎదురైనా నవ్వుతోనే దాటవేసిన ప్రభాస్, ఇప్పుడు మాత్రం "నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది" అంటూ ఓపెన్‌గా చెప్పడం చర్చనీయాంశంగా మారింది. అనుష్క నుంచి కృతి సనన్ వరకు పలువురితో ఆయన పేరు అనుసంధానమైనప్పటికీ, వాటిపై ఎప్పుడూ స్పష్టంగా స్పందించలేదు. అయితే ఈసారి మాత్రం తన మనసులోని కోరికను స్పష్టం చేశారు. టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన కపుల్ ఫ్రెండ్లీ చిత్రం మంచి స్పందన తెచ్చుకుంటున్న నేపథ్యంలో ఆ చిత్ర బృందంతో ప్రభాస్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి ప్రేమపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా, ప్రభాస్ తొలుత సిగ్గుపడుతూ స్పందించారు. "ఇది వ్యక్తిగత ప్రశ్న కదా" అంటూ చిరునవ్వుతో మొదలుపెట్టి, "నిజం చెప్పాలంటే నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది. ఆ అద్భుతమైన అనుభూతిని ఆస్వాదించాలని ఉంది. ఆ క్షణం కోసం నేనూ ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పడం విశేషం. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. సలార్ 2, స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 వంటి భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. వ్యక్తిగత జీవితంపై చేసిన ఈ వ్యాఖ్యలతో పాటు, ఆయన తదుపరి చిత్రాలపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.



# బాలీవుడ్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టిన తాప్సీ..

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగులో తక్కువ సినిమాలే చేసినప్పటికీ స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి తాప్సీ పన్ను ప్రస్తుతం పూర్తిగా హిందీ చిత్రసీమపైనే దృష్టి కేంద్రీకరించినట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన ఆమె, వరుస విజయాలతో మంచి పేరు సంపాదించింది. కెరీర్ మంచి దశలో ఉన్నప్పుడే బాలీవుడ్ వైపు అడుగులు వేసిన తాప్సీ, అక్కడ కూడా తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. కమర్షియల్ చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథల్లో నటిస్తూ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో రవితేజ, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించి గుర్తింపు పొందిన తాప్సీ, ఆ తరువాత హిందీ చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకుంది. అక్కడ మహిళా ప్రధాన పాత్రలతో ప్రత్యేక ముద్ర వేసుకుని, ఫైర్‌బ్రాండ్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఎక్కువగా హిందీ చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో తెలుగులో కనిపించి చాలా కాలం అయ్యింది. ఇటీవల తనకు ఇంకా జీవితంలో ఎన్నో అనుభవాలు ఆస్వాదించాలని ఉందని చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. తెలుగు ప్రేక్షకులకు ఒకప్పుడు సుపరిచితమైన ఈ క్రేజీ హీరోయిన్ మళ్లీ టాలీవుడ్‌లో కనిపిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# సూపర్-8 ఫార్మాట్ విషయంలో ఐసీసీపై విమర్శలు




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 ఫార్మాట్‌పై క్రీడా వర్గాల్లో విపరీతమైన చర్చ కొనసాగుతోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రవేశపెట్టిన ప్రీ-సీడింగ్ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుతంగా ప్రదర్శన ఇచ్చిన టాపర్ జట్లకు అన్యాయం జరుగుతుందని క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ఏ టోర్నీలోనైనా గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత టాప్‌లో నిలిచిన జట్లకు తదుపరి రౌండ్లో కాస్త ఉపశమనం ఇచ్చేలా సీడింగ్ విధానం ఉంటుంది. కానీ ఈసారి ఐసీసీ టోర్నీ ప్రారంభం కాకముందే ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. టోర్నీ ప్రారంభం కాకముందే సీడింగ్ వేయడం ప్రీ-సీడింగ్ అని పిలవబడుతుంది. దీని అర్థం ఏదంటే ఒక జట్టు తన గ్రూపులో మొదటి లేదా రెండో స్థానంలో నిలిచినా ముందుగా నిర్ణయించిన స్లాట్‌లోనే ఉంటుంది. ఈ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భారత్, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే జట్లు ఒకే గ్రూపులో ఉండడం వల్ల రెండు జట్లు సెమీస్‌కు చేరకపోవాల్సి వస్తోంది. అదే సమయంలో రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లకు సెమీస్ చేరడం సులభమవుతుంది. దీనివల్ల టాపర్లుగా నిలిచిన జట్లకు అన్యాయం జరిగిందని, ప్రతిభను గౌరవించేలా లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐసీసీ స్పందనలో, భారత్, శ్రీలంక సంయుక్తంగా టోర్నీ నిర్వహిస్తున్నందున రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌లకు ముందుగానే ప్లాన్ చేసుకోవడం కోసం ప్రీ-సీడింగ్ విధానం తీసుకున్నామని, అభిమానులు, మీడియా కోసం సౌకర్యాన్ని కల్పించడమే ఉద్దేశమని తెలిపింది.దీని అర్థం ఏదంటే ఒక జట్టు తన గ్రూపులో మొదటి లేదా రెండో స్థానంలో నిలిచినా ముందుగా నిర్ణయించిన స్లాట్‌లోనే ఉంటుంది. ఈ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భారత్, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే జట్లు ఒకే గ్రూపులో ఉండడం వల్ల రెండు జట్లు సెమీస్‌కు చేరకపోవాల్సి వస్తోంది. అదే సమయంలో రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లకు సెమీస్ చేరడం సులభమవుతుంది. దీనివల్ల టాపర్లుగా నిలిచిన జట్లకు అన్యాయం జరిగిందని, ప్రతిభను గౌరవించేలా లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# మా ప్రభుత్వం కారణంగా మేం నవ్వులపాలయ్యాం..




## బీసీబీ మాజీ జనరల్ సెక్రటరీ

**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీలో బంగ్లాదేశ్ జట్టును అంతర్జాతీయ క్రికెట్ మండలి తప్పించిన ఘటనపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అష్రాఫుల్ హక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భద్రతా కారణాలను సాకుగా చూపుతూ భారత్‌లో మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు స్పష్టం చేయడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ మాటలకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ ప్రభావితమయ్యారని ఆరోపించారు. ఒక క్రికెట్ పరిపాలకుడిగా తాను నిబద్ధత, నిజాయితీని విశ్వసిస్తానని పేర్కొన్న ఆయన అమీనుల్ ఇస్లామ్ అమాయకుడని, నఖ్వీ వలలో పడ్డారని వ్యాఖ్యానించారు. నఖ్వీ ఒత్తిడికి లోనై తీసుకున్న నిర్ణయం వల్ల దేశానికి ప్రయోజనం కలగలేదని అన్నారు. ప్రపంచ కప్ వివాదం సమయంలో మా ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలకు సరైన కారణాలు లేవని విమర్శించారు. బంగ్లాదేశ్ క్రికెట్‌కు భారత నిర్వాహకుల మద్దతు ఎంతో అవసరమని స్పష్టం చేస్తూ గతంలో జగన్మోహన్ దాల్మియా కాలంలో తమ దేశానికి గౌరవం, గుర్తింపు లభించేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కొంతమంది వ్యక్తుల నిర్ణయాలు మరియు ప్రభుత్వ చర్యల కారణంగా బంగ్లాదేశ్ క్రికెట్ ప్రపంచ వేదికపై నవ్వులపాలైందని సయ్యద్ అష్రాఫుల్ హక్ ఆవేదన వ్యక్తం చేశారు.

# అఫ్ఘనిస్థాన్ క్రికెట్‌కు చుక్కాని.. చెరగని ముద్రతో జొనాథన్ ట్రాట్ వీడ్కోలు

**వేద న్యూస్ డెస్క్:**

ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా గుర్తింపు లేని అఫ్ఘనిస్థాన్ జట్టు, గత కొన్నేళ్లలో సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. ఆ జట్టులో వచ్చిన ఈ అనూహ్య మార్పుకు ప్రధాన కారణంగా నిలిచింది హెడ్ కోచ్ జొనాథన్ ట్రాట్. తన అనుభవం, వ్యూహాత్మక ఆలోచన, యువ ఆటగాళ్లలో నమ్మకం నూరిపోసే తీరు ద్వారా ట్రాట్ అఫ్ఘన్ జట్టును కొత్త స్థాయికి తీసుకెళ్లాడు. మూడు సంవత్సరాల వ్యవధిలో అఫ్ఘనిస్థాన్ జట్టు ఆటతీరులో స్పష్టమైన మెరుగుదల కనిపించింది. ఒకప్పుడు చిన్న జట్టుగా భావించిన ప్రత్యర్థులు, ఇప్పుడు అఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్ అంటే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో చివరి మ్యాచ్ అనంతరం ట్రాట్ తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించడంతో ఆటగాళ్లు భావోద్వేగానికి లోనయ్యారు. జట్టుతో గడిపిన సమయం తనకు అమూల్యమని, ఆటగాడిగానే కాదు కోచ్‌గా కూడా మర్చిపోలేని అనుభవాలు పొందానని ట్రాట్ తెలిపాడు. ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై తొలి విజయం, ఇంగ్లండ్‌పై చారిత్రాత్మక గెలుపు, బలమైన జట్లపై ద్వైపాక్షిక సిరీస్ విజయాలు తన కోచింగ్ ప్రయాణంలో ముఖ్య ఘట్టాలుగా నిలిచాయని పేర్కొన్నాడు. కెనడాపై విజయానికి కీలకంగా నిలిచిన ఇబ్రహీం జద్రాన్ తన ఉత్తమ ఆటగాడు అవార్డును ట్రాట్‌కు అంకితం చేయడం అతనిపై ఉన్న గౌరవాన్ని చూపించింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక, ఇంగ్లండ్, పాకిస్థాన్ వంటి మాజీ ఛాంపియన్లను ఓడించి అఫ్ఘన్ జట్టు సంచలనం సృష్టించింది. అంతేకాదు, పొట్టి ప్రపంచకప్‌లోనూ రషీద్ ఖాన్ నాయకత్వంలో సెమీఫైనల్‌కు చేరడం ఆ దేశ క్రికెట్ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. ఐసీసీ నిర్వహించిన ప్రధాన టోర్నమెంట్‌లో సెమీఫైనల్ వరకు రావడం అఫ్ఘనిస్థాన్‌కు విశేష ఘనత. అయితే తాజా సీజన్‌లో మాత్రం జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ట్రాట్ వేసిన పునాది భవిష్యత్తులో ఆ జట్టుకు మరింత బలం చేకూర్చనుందనే నమ్మకం క్రీడా వర్గాల్లో వ్యక్తమవుతోంది.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073